సాక్షి కామారెడ్డి

గురువారం । 23 । జనవరి । 2025



పకడ్బందీగా పరీక్షలు

జిల్లావ్యాప్తంగా ఇంటర్ పరీక్షలు పకడ్బం దీగా నిర్వహిస్తామని ఇంటర్మీడియట్ నోడల్ అధికారి షేక్ సలాం తెలిపారు.

- 9లో ▸



భూ వివాదంతోనే హత్య

రామారెడ్డి మండలం అన్నారం గ్రామంలో భూ వివాదంతో ఓ వ్యక్తి సుపారీ ఇచ్చి తన సోదరుడిని హత్య చేయించాడు.

- 8లో ▸

గరిష్టం/కనిష్టం
31.9 /9.6

వాతావరణం

ఉదయం మంచు దట్టంగా కురుస్తుంది. చల్లని గాలులు వీస్తాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. చలి తీవ్రత కొనసాగుతుంది.

న్యూస్‌రీల్

ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తా

- మాస్టర్‌ప్లాన్ బాధిత రైతులతో మున్సిపల్ చైర్‌పర్సన్ ఇందుప్రియ



కామారెడ్డి టౌన్: కామారెడ్డి మున్సిపల్ మాస్టర్‌ప్లాన్ బాధిత రైతుల సమస్యను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్తానని మున్సిపల్ చైర్‌పర్సన్ ఇందుప్రియ అన్నారు. మాస్టర్‌ప్లాన్ బాధితుల జేఏసి ఆధ్వర్యంలో రైతులు బుధవారం మున్సిపల్ కార్యాలయంలో ఆమెను కలిసి, సమస్యను వివరించారు. మాస్టర్‌ప్లాన్ రద్దు జీవో కోసం కృషి చేస్తానని ఆమె హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ స్పందన, రైతులు పాల్గొన్నారు.

గురుకుల కాలేజీలో ఆర్థిక శాఖ కార్యదర్శి బస




ఎల్లారెడ్డిరూరల్: విద్యార్థినులు బాగా చదివి మంచి మార్కులను సాధించాలని రాష్ట్ర ఆర్థిక శాఖ సంయుక్త కార్యదర్శి హరిత అన్నారు. బుధవారం రాత్రి ఎల్లారెడ్డి పట్టణంలోని గిరిజన బాలికల గురుకుల పాఠశాలను ఆమె తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించిన అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేసి పాఠశాలలోనే బస చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సావిత్రి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు భద్రతపై అవగాహన అవసరం



కామారెడ్డి క్రైం: రోడ్డు భద్రత నిబంధనలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని డీటీవో శ్రీనివాస రెడ్డి సూచించారు. రహదారి భద్రతా మాసోత్సవాల్లో భాగంగా బుధవారం జిల్లా రవాణా శాఖ కార్యాలయం ఆవరణలో ఆయా పనుల నిమిత్తం కార్యాలయానికి వచ్చిన వారికి అవగాహన కల్పించారు. డీటీవో మాట్లాడుతూ.. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంవీఐలు, ఏఎంవీఐలు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు



గాంధారి: అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందుతాయని, ఎవరూ ఆందోళన చెందొద్దని డీఆర్‌డీవో సురేందర్ సూచించారు. మండలంలోని జువ్వాడి గ్రామసభలో ఆయన మాట్లాడారు. గ్రామసభల్లో చదివి వినిపించే జాబితాలు దరఖాస్తులు చేసుకున్న వారివన్నారు. ఈ జాబితాల్లో ఉన్నవారందరూ లబ్ధిదారులు కాదని తెలిపారు. జాబితాలో పేర్లు లేనివారు అర్హులైతే దరఖాస్తులు తీసుకుని వారిని ఎంపిక చేస్తామని స్పష్టం చేశారు. గ్రామసభల్లో చదివిన జాబితాల్లో అనర్హులుంటే తొలగిస్తామన్నారు. మండల ప్రత్యేకాధికారి లక్ష్మీప్రసన్న, ఎంపీడీవో రాజేశ్వర్ ఉన్నారు.

పరిశోధనల్లో వెనుకబడి ఉన్నాం

కామారెడ్డి అర్బన్: పరిశోధన, మేధాసంపత్తి హక్కులు పొందడంలో యూరప్ దేశాల కన్న మనం ఎంతో వెనుకబడి ఉన్నామని వివిధ కళాశాల అధ్యాపకులు అభిప్రాయపడ్డారు. బుధవారం కామారెడ్డి ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల వృక్షశాస్త్ర విభాగం, కరీంనగర్ ఎస్ఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల సంయుక్త ఆధ్వర్యంలో 'మేధో సంపత్తి హక్కులు– ఉన్నత విద్యలో పరిశోధన' అనే అంశంపై వెబినార్ నిర్వహించారు. మేధో సంపత్తి, పరిశోధనల్లో ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా అభివృద్ధి చెందాలని, అధ్యాపకులు, విద్యార్థుల నిరంతర కృషి అవసరమన్నారు. వెబినార్‌లో కామారెడ్డి ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ విజయ్‌కుమార్, కరీంనగర్ కళాశాల ప్రిన్సిపాల్ రామకృష్ణ ప్యాట్రన్లుగా వ్యవహరించారు.

రెండో రోజూ అదే లొల్లి

- అర్హుల జాబితాల్లో తమ పేర్లు లేవంటూ ఆందోళన
- గ్రామసభలో అధికారుల నిలదీత
- ఎన్నిసార్లు దరఖాస్తు చేసుకోవాలంటూ ఆగ్రహం
- ఆత్మీయ భరోసా జాబితాల్లో అనర్హుల పేర్లున్నాయని ఆరోపణలు
- రానివాళ్లు దరఖాస్తు చేసుకోవాలని నచ్చచెప్పిన అధికారులు

కొత్త రేషన్ కార్డు కోసం ఏళ్లుగా నిరీక్షిస్తున్న వారు.. జాబితాలో తమ పేరు లేకపోవడంతో ఆగ్రహం వ్యకం చేస్తున్నారు. రైతు ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇళ్లకు అన్ని అర్హతలు ఉన్నా తమను ఎంపిక చేయకపోవడంతో పలువురు గ్రామసభల్లో అధికారులను నిలదీశారు. తమకు న్యాయం చేయాలని ఆందోళన చేపట్టారు.



నస్రుల్లాబాద్‌లో అధికారులను ప్రశ్నిస్తున్న గ్రామస్తులు

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి : నాలుగు పథకాల కోసం నిర్వహించిన ప్రజాపాలన గ్రామ సభలు రెండో రోజూ జిల్లా అంతటా నిలదీతలు, నిరసనల మధ్యనే కొనసాగాయి. జిల్లాలో బుధవారం 153 గ్రామాలు, మున్సిపాలిటీల్లోని 23 వార్డుల్లో ప్రజాపాలన సభలు జరిగాయి. కాగా చాలా గ్రామాల్లో జరిగిన సభల్లో రేషన్ కార్డుల జాబితాల్లో తమ పేర్లు లేవని జనం అధికారులను నిలదీశారు. అలాగే ఇందిరమ్మ ఆత్మీయ భరోసా జాబితాలో అనర్హుల పేర్లున్నాయని, భూములు లేని తమ పేర్లు లేవని పలు చోట్ల గొడవలకు దిగారు. అధికారులు సముదాయించే ప్రయత్నం చేశారు. రాని వాళ్లు తిరిగి దరఖాస్తు చేసుకోవాలని అధికారులు నచ్చి చెప్పాల్సి వచ్చింది.

ప్రజల్లో ఆగ్రహం

బిచ్కుంద మండలం గోపన్‌పల్లిలో ఆయా పథకాల అర్హుల జాబితాల్లో తమకు అన్యాయం జరిగిందని, న్యాయం చేసేదాకా వెళ్లొద్దంటూ దారికి అడ్డంగా బైఠాయించి నిరసన తెలిపారు. అధికారులు వారికి సముదాయించి కార్యక్రమాన్ని ముగించారు. నస్రుల్లాబాద్ మండలంలో పలు గ్రామాల్లో భూములున్న వారికి ఆత్మీయ భరోసా జాబితాలో పేర్లొచ్చాయని ఆందోళనకు దిగారు. నస్రుల్లాబాద్‌లో గ్రామసభ ఆలస్యంగా ప్రారంభం కావడంపై ఆగ్రహం వ్యక్తం చేరారు. బాన్సువాడ మండలంలోని పలు గ్రామాల్లో లబ్ధిదారుల జాబితాలన్నీ తప్పులతడకలంటూ ప్రజలు నిరసన తెలిపారు. ఇబ్రహీంపేట్‌లో అధికారులను నిలదీశారు. పోచారం గ్రామంలో రేషన్ కార్డులు రాలేవని అధికారులను ప్రశ్నించారు. మహ్మద్‌నగర్ మండలం కోమలంచ గ్రామంలో ప్రజలు అధికారులను నిలదీశారు. మాచారెడ్డి మండలం రత్నగిరిపల్లి, గస్‌పూర్ గ్రామాల్లో అర్హుల జాబితాల్లో తమ పేర్లు లేవంటూ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. బీబీపేట మండలం తుజాల్‌పూర్‌లో గ్రామసభ రసాభసగా జరిగింది. ఆత్మీయభరోసాలో అక్రమాలు జరిగాయని ఆరోపిస్తూ అధికారులను నిలదీశారు. పలు గ్రామాల్లో జరిగిన గ్రామసభల్లో కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్, అదనపు కలెక్టర్లు శ్రీనివాస్ రెడ్డి, వి విక్టర్ పాల్గొన్నారు.



బిచ్కుంద మండలం గోపన్‌పల్లిలో నిరసన తెలుపుతున్న ప్రజలు



తుజాల్‌పూర్‌లో ఎంపీడీవో పూర్ణచంద్రోదయకుమార్‌ను నిలదీస్తున్న గ్రామస్తులు

రేషన్ కార్డుల కోసం..

రాష్ట్రంలో చాలా కాలంగా నూతన రేషన్ కార్డులు ఇవ్వకపోవడంతో ఎంతో మంది ఏళ్ల నుంచి నిరీక్షిస్తున్నారు. తీరా ప్రస్తుతం ప్రభుత్వం ప్రకటించిన జాబితాల్లో తమ పేర్లు రాకపోవడంతో అధికారులతో గొడవకు దిగుతున్నారు. ప్రతీ గ్రామంలో ఇదే సమస్య ఎదురవుతోంది. తమకు కార్డులు ఇవ్వాల్సిందేనంటూ ఆందోళనలకు దిగుతున్నారు. వారిని సముదాయించడానికి అధికారులు నానా ఇబ్బందులు పడాల్సి వస్తోంది. అలాగే భూమిలేని రైతు కూలీల కోసం ప్రవేశపెట్టిన ఇందిరమ్మ ఆత్మీయ భరోసా కూడా చాలా మంది అర్హులకు రాలేదు. ఇదే సమయంలో అనర్హుల పేర్లు వచ్చాయంటూ చాలా గ్రామాల్లో నిరసనలకు దిగుతున్నారు. లీడర్లు చెప్పినవారి పేర్లే రాశారంటూ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇందిరమ్మ ఇళ్ల జాబితాలపైనా అవే నిరసనలు కొనసాగాయి.

మాస్టర్ ప్లాన్ రద్దయింది..
ఆందోళన చెందొద్దు



రైతులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి

- పుర ప్రజల మెప్పుతో నూతన మాస్టర్‌ప్లాన్ అమలు చేద్దాం
- బాధిత రైతులతో ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి

కామారెడ్డి టౌన్: కామారెడ్డి మున్సిపల్‌లో 2023 ప్రవేశ పెట్టిన ముసాయిదా మాస్టర్ ప్లాన్ రద్దయిందని, రైతులు ఆందోళన చెందవద్దని కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకట రమణారెడ్డి అన్నారు. బుధవారం మాస్టర్ ప్లాన్ బాధిత జేఏసీ ఆధ్వర్యంలో రైతులు జిల్లా కేంద్రంలోని క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యేను కలిశారు. మున్సిపల్ కౌన్సిల్ మాస్టర్ ప్లాన్ రద్దు కోసం తీర్మానం చేసినా ఇంకా అధికారికంగా ప్రభుత్వం నుంచి జీవో రాలేదని ఇంకా ఆందోళనగా ఉందని తమకు న్యాయం చేయాలని రైతులు ఎమ్మెల్యేకు కోరారు. అవసరానికి, ఆపదలో భూములు అమ్ముకుందామంటే కొనే వారు ముందుకు రావడం లేదని ప్రభుత్వం నుంచి రద్దు జీవో తీసుకురావాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రైతులతో మాట్లాడారు. మాస్టర్ ప్లాన్ రద్దయిందని, రైతులు ఆందోళన చెందవద్దని సూచించారు. రద్దయిన మాస్టర్‌ప్లాన్ ఎక్కడా అమలు కావడం లేదని చెప్పారు. ప్రభుత్వం ఆదేశాల మేరకు మళ్లీ నూతన మాస్టర్‌ప్లాన్ కోసం సర్వే చేసి ముసాయిదాను సిద్ధం చేసిన తర్వాత ప్రజల నుంచి అభ్యంతరాలు స్వీకరించి, మళ్లీ కౌన్సిల్ తీర్మానం చేశాకే నూతన మాస్టర్‌ప్లాన్ అమలవుతుందని వివరించారు. అప్పటి దాక పాత మాస్టర్‌ప్లాన్ అమలులో ఉంటుందన్నారు. 8 గ్రామాల బాధిత రైతుల భూముల విషయంలో ఇండస్ట్రీయల్, గ్రీన్‌జోన్‌ల సమస్య ఏర్పడితే అండగా ఉంటానని భరోసానిచ్చారు. ప్రజల మెప్పుతోనే నూతన మాస్టర్‌ప్లాన్ అమలు చేసుకుందామన్నారు. ఈ కార్యక్రమంలో రైతు ఐక్య కార్యాచరణ కమిటీ సభ్యులు, 8 గ్రామాల బాధిత రైతులు పాల్గొన్నారు.

అర్హులు దరఖాస్తు చేసుకోవాలి

- కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

తాడ్వాయి: ప్రభుత్వం నూతనంగా ప్రవేశ పెడుతున్న పథకాల జాబితాలో పేరు రాని అర్హులు గ్రామసభల్లో దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ సూచించారు. తాడ్వాయి మండలం బ్రహ్మాజీవాడి గ్రామంలో బుధవారం నిర్వహించిన గ్రామసభలో ఆయన మాట్లాడారు. ఎంపీడీవో కార్యాలయంలో కూడా దరఖాస్తు చేసుకునే అవకాశం ఉందన్నారు. గ్రామసభలలో ఏమైన అభ్యంతరాలు, ఆక్షేపణలు, చేర్పులు ఉంటే తెలువచ్చన్నారు. దరఖాస్తులను పరిశీలించిన తదుపరి చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి రాజారాం, ఎంపీడీవో సయ్యద్ సాజీద్‌అలీ, ఏవో నర్సింలు, ఏపీఎం మనోహర్, ఏపీవో కృష్ణగౌడ్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

యుద్ధప్రాతిపదికన సబ్‌స్టేషన్ మరమ్మతులు

- ఎన్‌పీడీసీఎల్ డైరెక్టర్ అశోక్‌కుమార్

కామారెడ్డి టౌన్: కామారెడ్డి పట్టణంలోని సిరిసిల్ల రోడ్డులో గల 33/11 కేవీ సబ్‌స్టేషన్‌లో యుద్ధ ప్రాతిపదికన మరమ్మతులు చేయిస్తామని ఎన్‌పీడీసీఎల్ డైరెక్టర్ (హెచ్ఆర్‌డీ అండ్ ఐఆర్) బి అశోక్ కుమార్ తెలిపారు. సబ్ స్టేషన్‌లో అగ్ని ప్రమాదం జరగడంతో బుధవారం ఆయన పరిశీలించారు. ప్రమాద వివరాలను తెలుసుకున్నారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. ప్రమాదవశాత్తు అగ్ని ప్రమాదం జరిగిందని ఎవరి నిర్లక్ష్యం లేదన్నారు. ప్రమాదం జరిగిన గంటలోపే సబ్‌స్టేషన్ పరిధిలోని ప్రాంతాలకు విద్యుత్ సరఫరా పునరుద్ధరించడానికి చర్యలు చేపట్టిన అధికారులను అభినందించారు. ప్రమాదంతో రూ.1.50 కోట్ల ఆస్తి నష్టం జరిగిందని చెప్పారు. ఇలాంటి ఘటనలు పునరావృత్తం కాకుండా చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో జిల్లా సూపరింటెండెంట్ ఇంజినీర్ ఎస్ శ్రావణ్, డీఈలు కళ్యాణ్ చక్రవర్తి, ప్రభాకర్, నాగరాజు. ఈఈ స్వామి, ఏడీఈలు కిరణ్ చైతన్య, సతీష్, జైరాజ్, చంద్రకాంత్ తదితరులు పాల్గొన్నారు.



సబ్‌స్టేషన్‌ను పరిశీలిస్తున్న అధికారులు

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి

అదనపు కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి

పిట్లం(జుక్కల్): విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి సూచించారు. పిట్లంలోని జ్యోతిబా పూలే గురుకుల పాఠశాలను బుధవారం ఆయన తనిఖీ చేశారు. పాఠశాలలోని స్టోర్ రూం, వంట గది, మధ్యాహ్న భోజనం పరిశీలించారు. విద్యార్థులతో కలిసి భోజనం చేశారు.

అర్హులకు పథకాలు అందేలా చూడాలి

మార్దండ గ్రామంలో బుధవారం జరిగిన ప్రజాపాలన గ్రామసభలో అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు. ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించి పరిశీలించారు. అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ పథకాలు అందేలా చూడాలని అధికారులకు సూచించారు. ఎంపీడీవో కమలాకర్, తహసీల్దార్ వేణుగోపాల్, తదితరులు పాల్గొన్నారు.



పిట్లం గురుకుల పాఠశాల వంట గదిని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి

ప్రశాంతంగా జేఈఈ మెయిన్స్ పరీక్ష



నిజామాబాద్‌లోని అర్సపల్లిలో జేఈఈ మెయిన్స్ పరీక్ష కేంద్రం వద్ద అభ్యర్థులు

నిజామాబాద్‌అర్బన్: నిజామాబాద్ నగరంలో బుధవారం జేఈఈ మెయిన్స్ పరీక్ష ప్రశాంతంగా జరిగింది. క్షత్రీయ ఇంజినీరింగ్ కళాశాల, అర్సపల్లిలోని ఏవీ ఎంటర్‌ప్రైజెస్‌లో పరీక్షలు జరిగాయి. అర్సపల్లి కేంద్రంలో ముగ్గురు విద్యార్థులు పరీక్షకు ఆలస్యంగా రాగా అధికారులు అనుమతించలేదు. దీంతో విద్యార్థులు విలపించారు.



ఆలస్యం కావడంతో అనుమతించని అధికారులు

లక్ష్యం ఘనం.. ఆచరణలో విఫలం

- మహిళా సంఘాల ఆర్థిక చేయూత కోసం అద్దె కేంద్రాల ఏర్పాటు
- అద్దెకు తీసుకువెళ్లే వారు లేక నిరుపయోగంగా మారిన పరికరాలు
- నిర్వహణ లేక పాడై పోతున్న యంత్రాలు



కస్టమ్ హైరింగ్ సెంటర్‌లో ట్రాక్టర్ (ఫైల్)

ఎల్లారెడ్డి: మహిళా సంఘాల ఆర్థిక చేయూత కోసం ప్రభుత్వం ఏర్పాటు చేయించిన వ్యవసాయ పరికరాల అద్దె కేంద్రాలు (కస్టమ్ హైరింగ్ సెంటర్లు) నిరుపయోగంగా మారుతున్నాయి. అద్దెకు తీసుకువెళ్లేవారు లేకపోవడంతో ఆయా యంత్ర పరికరాలు మూలకు పడుతున్నాయి. వ్యవసాయంలో యంత్రాల వాడకం పెరగడంతో ప్రభుత్వం రెండేళ్ల క్రితం ఈ పథకానికి శ్రీకారం చుట్టింది. దీనిలో భాగంగా వ్యవసాయానికి ఉపయోగపడే ట్రాక్టర్లు, నాగళ్లు, రోటవేటర్లు, కల్టివేటర్లు, వరి కోత మిషన్లు, పవర్ స్ప్రేయర్లు, బుష్ కట్టర్లు, డ్రమ్ సీడర్లు, డ్రోన్‌లు ఈ కేంద్రాల్లో అందుబాటు ఉంచారు. ఖరీదైన యంత్రాలను కొనుగోలు చేయలేని రైతులు ఈ కేంద్రాల్లో అద్దెకు తీసుకెళ్తారని భావించింది. బయట మార్కెట్ కంటే తక్కువ అద్దెకు ఇస్తారు. అయితే రైతుల నుంచి అంతగా స్పందన లేకపోవడంతో ఆయా యంత్రాలు నిరుపయోగంగా మారాయి.

నిర్వహణ లేక పనికిరాని డ్రోన్లు

తక్కువ సమయంలో పొలాల్లో ఎరువులు, సస్యరక్షణ మందులు స్ప్రే చేయడానికి కొనుగోలు చేసిన డ్రోన్లు దాదాపు అన్ని నిర్వహణ లేక మూలన పడ్డాయి. వీటి వాడకం విషయమై మహిళా సంఘాల కుటుంబంలోని యువకులకు శిక్షణ ఇప్పించినా వాటి వాడకం, నిర్వహణలో నైపుణ్యం లేక కొద్ది రోజులకే మూలన పడ్డాయి. ఈ పథకంతో లాభాల కంటే అప్పులే మిగిలాయని పలువురు మహిళలు ఆవేదన చెదుతున్నారు.

రుణాలు అందజేసి..

అద్దె కేంద్రాల్లో యంత్రాల కొనుగోలుకు బ్యాంకులు, స్త్రీనిధి ద్వారా రూ.25 లక్షల వరకు మహిళా సంఘాలకు రుణాలను అందజేశారు. ఇందులో సెర్ప్ ద్వారా 25 శాతం సబ్సిడీ ఇచ్చారు. మండలానికి ఒక యూనిట్ చొప్పున ఈ పథకాన్ని అమలు చేశారు. యంత్రాలు, పరికరాలను ఉపయోగించే విషయమై మహిళా సంఘాల సభ్యుల కుటుంబాల్లోని యువకులకు శిక్షణ కూడా ఇచ్చారు. మొదట్లో బాగా నడిచినా యంత్రాల వాడకంలో మహిళా సంఘాల సభ్యులకు సరైన నైపుణ్యం లేక, పనుల్లో నాణ్యత లేకపోవడంతో వాటిని అద్దెకు తీసుకునేవారు కరువయ్యారు.

ట్రాక్టర్లు, పరికరాలను ఎవరైన అద్దెకు తీసుకున్నా డబ్బులను పంట వచ్చాక చెల్లిసారు. అద్దె చెల్లించడంలో తీవ్ర జాప్యం చేస్తుండటంతో డీజిల్ ఖర్చులకు కూడా డబ్బులు లేక ఆయా పరికరాలు మూలన పడుతున్నాయి. అంతేగాక ఇప్పటికే గ్రామాల్లో చాలా మంది సొంతంగా ట్రాక్టర్లు కొనుగోలు చేశారు. వారికే వ్యవసాయ పనులు దొరక ఇతర పనులకు వెళ్తున్నారు. దీంతో కస్టమ్ హైరింగ్ సెంటర్ల ట్రాక్టర్లకు గిరాకీ రావడం లేదు. ట్రాలీలు కలిగిన ట్రాక్టర్లకు కిరాయిలు దొరుకుతున్నా అవి కూడా పెద్దగా లేవని తెలిసింది. పవర్ స్ప్రేయర్లు, బుష్ కట్టర్లు లాంటి చిన్న పరికరాలు మాత్రం రైతులు అద్దుకు తీసుకెళ్తున్నారు.

మరమ్మతులు కరువు

కస్టమ్ హైరింగ్ సెంటర్లలో ప్రస్తుతం మార్కెట్‌లో అందరు వినియోగించే ట్రాక్టర్లు కాకుండా ఇక్కడ అంతగా వాడకం లేని కుబాటా కంపెనీ ట్రాక్టర్లను జిల్లాలో మహి ళాసంఘాల ద్వారా కొనుగోలు చేయించారు. ఈ ట్రాక్టర్లకు మరమ్మతులు చేసేందుకు సర్వీస్ సెంటర్లు ఎక్కువగా లేకపోవడం, స్పేర్ పార్ట్స్ దొరకక పోవడంతో మూలనపడుతున్నాయి. మొదట్లో జిల్లాలో పలు చోట్ల సర్వీస్ సెంటర్లను ప్రారంభించినా ప్రస్తుతం నిజామాబాద్‌లో మాత్రమే ఈ కంపెనీ సర్వీస్ సెంటర్ పనిచేస్తుంది. అందులో స్పేర్‌పార్ట్స్ కూడా సరిగా ఉండటం లేదని మహిళా సంఘాల సభ్యులు అంటున్నారు.

కొత్త పథకాల అమలు

మహిళల నైపుణ్యాలు, మార్కెట్‌లో డిమాండ్ తదితర పరిస్థితులు పట్టించుకోకుండా అధికారులు పలు పథకాలు అమలు చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఎక్కడో ఒక చోట సక్సెస్ అయ్యాయని వారికి అంతగా అవగాహన లేని పథకాలను తమ టార్గెట్ల కోసం అధికారులు మహిళా సంఘాల ద్వారా ఏర్పాటు చేయిస్తుండటంతో వారు ఆర్థికంగా నష్టపోతున్నారని విమర్శలు వస్తున్నాయి. ప్రధాన మంత్రి కుసుమ్ యోజన కింద సోలార్ యూనిట్లు, డ్రోన్ దీదీ పథకం, సిమెంట్ ఇటుకల తయారీ, మహిళా శక్తి క్యాంటీన్లు, దేశీ కోళ్ల పెంపకం లాంటి పథకాలను ఏర్పాటు చేయించడానికి అధికారులు సిద్ధమవుతున్నారు. ఇందులో పలు యూనిట్లు కొందరు మహిళలు ఏర్పాటు చేసుకున్నారు. పీఎం కుసుమ్ యోజన పథకం కింద నాలుగైదు ఎకరాల ప్రభుత్వ భూముల్లో దాదాపు రూ.3కోట్లకు వ్యయంతో సోలార్ ప్లాంట్ ఏర్పాటు చేస్తారు. ఇందులో కొంత ప్రభుత్వం సబ్సిడీ ఇస్తుంది. అయినా ఇంత భారీ యూనిట్ ఏర్పాటు చేశాక ఏమైనా సమస్య వస్తే ఎలా అని పలువురు అంటున్నారు. ఆయా యూనిట్లతో కష్టానికి తగ్గ ప్రతిఫలం రావడం కష్టమేనని, పైగా అప్పులు మిగులుతాయని పలువురు మహిళలు అంటున్నారు.



మూలనపడ్డ డ్రోన్

పసుపు ధరపై ఆశలు

- బోర్డు ఏర్పాటుతో పంట రేటు పెరుగుతుందంటున్న రైతులు
- ప్రస్తుతం క్వింటాలుకు రూ. 12వేలు వరకు పలుకుతున్న వైనం



రెంజర్లలో ఉడికించి ఆరబెట్టిన పసుపు

బాల్కొండ: పసుపు బోర్డు ఏర్పాటు కావడంతో పసుపు పంటకు మంచి ధర పలుకుతుందని రైతులు ఆశలు పెంచుకుంటున్నారు. రెండు దశబ్దాలుగా పసుపు బోర్డు కోసం రైతులు అనేక ఉద్యమాలు చేపట్టారు. ఎట్టకేలకు ఇటీవల నిజామాబాద్ కేంద్రంగా పసుపు బోర్డును కేంద్ర ప్రభుత్వం ప్రారంభించింది. ఈక్రమంలో పసుపు పంటకు మద్దతు ధర క్వింటాలుకు రూ.15వేలు దక్కుతుందని ప్రస్తుతం అన్నదాతలు ఆశిస్తున్నారు. గతంలో పసుపు పంటకు ధర లేకపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. గతేడాది పంటకు మంచి ధర దక్కడంతో ప్రస్తుత సంవత్సరం అధికంగా సాగు చేస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా 33 వేల ఎకరాల్లో పసుపు సాగు చేశారు. ప్రస్తుతం పసుపు తవ్వకాలు జోరందుకున్నాయి. కొందరు రైతులు ఇదివరకే పసుపు పంటను మార్కెట్‌కు తరలించారు. క్వింటాలకు రూ.11వేల నుంచి రూ.12వేల వరకు మార్కెట్‌లో ధర పలుకుతోంది. రానున్న రోజుల్లో పంటకు మరింత ధర పెరిగే అవకాశం ఉందని రైతులు అనుకుంటున్నారు. క్వింటాలుకు రూ.15 వేలపైనే ధర దక్కుతుందని ఆశిస్తున్నారు. ప్రస్తుతం పసుపు బోర్డు ఏర్పడటంతో ధరపై దడ లేదంటున్నారు.

దిగుబడిపై దిగులు లేదు..

ప్రస్తుత సంవత్సరం పసుపు పంట దిగుబడిపై ఎలాంటి దిగులు లేదని అన్నదాతలు అంటున్నారు. పసుపు పంటకు ప్రధాన తెగుళ్ల ఎక్కువగా సోకక పోవడంతో దిగుబడి ఆశాజనకంగా ఉందంటున్నారు. సాధారణంగా ఎకరానికి ఆరు ట్రాక్టర్ల కొమ్ము, రెండు ట్రాక్టర్ల దుంప వస్తుంది. ప్రస్తుతం అంత కంటే ఎక్కువ కూడా దిగుబడి వచ్చే అవకాశం ఉంది. పసుపు కొమ్ములో కూడ దుంపకుళ్లు లేకపోవడంతో నాణ్యత బాగానే ఉంది. దీంతో మంచి ధర దక్కుతుందని రైతులు ఆశిస్తున్నారు. గతంలో వర్షపాతం ఎక్కువ కావడంతో పసుపు పంటకు దుంపకుళ్లు, మర్రాకు తెగులు సోకేది. ప్రస్తుత సంవత్సరం అలాంటి పరిస్థితి లేదంటున్నారు.

మంచి ధర దక్కే అవకాశం

పసుపు బోర్డు ఏర్పాటు కావడంతో పంటకు మంచి ధర దక్కుతుందని ఆశిస్తున్నాం. పెరిగిన ఖర్చులతో ఎక్కువ పెట్టుబడి అవసరం అవుతుంది. కనీసం క్వింటాలుకు రూ.15 వేల ధర పలికితే రైతులకు నష్టం ఉండదు.

– రాజేశ్వర్, రైతు

ఏళ్ల నుంచి ఎదురు చూశాం

పసుపు బోర్డు కోసం ఏళ్ల నుంచి ఎదురు చూశాం. ఇప్పుడు బోర్డు ఏర్పాటు కావడంతో ధర పెరుగుతుందని ఆశిస్తున్నాం. ప్రస్తుతం మార్కెట్‌లో క్వింటాలుకు రూ.11వేలు ధర పలుకుతోంది. మద్దతు ధర క్వింటాలుకు కనీసం రూ.15వేలు ఉంటే పసుపు రైతులకు ఊరట ఉంటుంది.

– రమేశ్, రైతు

క్లుప్తంగా

అథ్లెటిక్స్‌లో హోంగార్డు ప్రతిభ



కామారెడ్డి క్రైం: టాటా సంస్థ ఆధ్వర్యంలో ఇటీవల ముంబయిలో నిర్వహించిన అంతర్జాతీయ మారథాన్ అథ్లెటిక్స్ పోటీల్లో జిల్లా రవాణా శాఖలో హోంగార్డుగా పనిచేస్తున్న అశోక్ పాల్గొని నాలుగో స్థానంలో నిలిచాడు. కలెక్టర్ సంగ్వాన్‌ను ఆయన ఛాంబర్‌లో బుధవారం డీటీవో శ్రీనివాస్ రెడ్డితో కలిసి హోంగార్డు అశోక్ కలిశారు. ఈసందర్భంగా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అభినందించారు. భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని కలెక్టర్ ఆకాంక్షించారు. ప్రోత్సహించిన జిల్లా రవాణా శాఖ అధికారులకు అశోక్ కృతజ్ఞతలు తెలిపారు. తనకు సూపర్‌న్యూమరీ విధానంలో హోంగార్డు నుంచి కానిస్టేబుల్‌గా పదోన్నతి కల్పించాలని కలెక్టర్, డీటీవోలను అశోక్ కోరారు.

రాష్ట్ర స్థాయి పరేడ్‌కు మాచారెడ్డి విద్యార్థులు



మాచారెడ్డి: రాష్ట్రంలో జనవరి 26న జరగనున్న రిపబ్లిక్‌డే పరేడ్‌కు మాచారెడ్డి మండలం ఘన్పూర్, సోమారంపేట విద్యార్థులు ఎంపికైనట్లు ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు శారద, భాస్కర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 19 నుంచి 24 వరకు ఫైనల్ రిహార్సల్ పరేడ్ జరుగుతుందన్నారు. 26న రాష్ట్ర గవర్నర్ ముందు పరేడ్ చేస్తారని వెల్లడించారు. ఎంపిక కావడంపై కామారెడ్డి స్కౌట్స్ అండ్ గైడ్స్ జిల్లా కార్యదర్శి శ్రీనివాస్ హర్షం వ్యక్తం చేశారు. కామారెడ్డి జిల్లాకు చెందిన డిస్ట్రిక్ట్ ట్రైనింగ్ కమిషనర్ గోపాల్ కృష్ణ, భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ పరేడ్ కాంటిజెంట్‌కి కమాండర్‌గా వ్యవహరిస్తారని తెలిపారు.

టోల్‌గేట్ కార్మికుల వేతనాలు తగ్గిస్తే ఊరుకునేది లేదు



భిక్కనూరు: తొమ్మిది ఏళ్లుగా భిక్కనూరు టోల్‌ప్లాజాలో పనిచేస్తున్న కార్మికుల వేతనాలు తగ్గించడంతో పాటు కొందరు కార్మికులను ఉద్వాసన పలికేందుకు నూతన కాంట్రాక్టర్ యత్నిస్తున్నారని, ఈనిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ కార్మికులకు అండగా బీఆర్‌ఎస్ ఉంటుందని పార్టీ మండల ప్రధాన కార్యదర్శి అత్తెల్లి శ్రీనివాస్ అన్నారు. బుధవారం భిక్కనూరు టోల్‌ప్లాజా కార్మికులు చేపట్టిన ధర్నా కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. నూతన కాంట్రాక్టర్ పాత ఉద్యోగులను తొలగించకుండా నూతనంగా ఉద్యోగులను రిక్రూట్ చేసుకుని వాహనదారులకు మరిన్ని సౌకర్యాలు కల్పించాలని కోరారు. బీఆర్‌ఎస్ నేతలు అందే మహేందర్‌రెడ్డి, వగేటి చిన్నన ర్సారెడ్డి, ద్యావర సాయిరెడ్డి పాల్గొన్నారు.

కుక్కల దాడిలో జింకకు గాయాలు

బాన్సువాడ రూరల్: మండలంలోని జక్కల్‌దాని తండా శివారులో జింకపై కుక్కలు దాడి చేసి గాయపరిచాయి. సమీప పంటపొలాల్లోకి వచ్చిన జింకను బుధవారం స్థానిక రైతులు రక్షించారు. దాడి చేసిన కుక్కలను తరమివేశారు. అనంతరం వారు జింకను బాన్సువాడలోని అటవీశాఖ అధికారులకు అప్పగించారు. వారు జింకకు ప్రాథమిక చికిత్స అందించి, అడవిలో వదిలిపెట్టారు.

ఆధ్యాత్మికం

సాముహిక హనుమాన్ చాలీసా పారాయణం



పిట్లం(జుక్కల్): మండల కేంద్రంలోని రామ్ మందిర్ ఆలయంలో మంగళవారం రాత్రి విశ్వ హిందూ పరిషత్, బజరంగ్ దళ్ సభ్యుల ఆధ్వర్యంలో సామూహిక హనుమాన్ చాలీసా పారాయణం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యక్రమంలో ప్రఖండ ప్రముఖ్ పాల్గొని హనుమంతుని గురించి వివరించారు. మొత్తం 112 మంది హనుమాన్ చాలీసా పారాయణంలో పాల్గొన్నారు.

అయ్యప్ప స్వామి విగ్రహం ఊరేగింపు

సదాశివనగర్(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలో బుధవారం అయ్యప్ప స్వామి విగ్రహ ఊరేగింపు ఘనంగా నిర్వహించారు. నంది విగ్రహం నుంచి అంబేడ్కర్ విగ్రహం వరకు అంగరంగ వైభవంగా ఊరేగించారు. భాజాభజంత్రీల మధ్య, అయ్యప్ప స్వాముల నామస్మరణతో మారుమ్రోగింది.

చుక్కాపూర్‌లో నృసింహ సుదర్శన హోమం

మాచారెడ్డి: చుక్కాపూర్ లక్ష్మీ నరసింహ స్వామి ఆలయంలో స్వాతి నక్షత్రం సందర్భంగా బుధవారం నృసింహ సుదర్శన హోమం నిర్వహించారు. కార్యక్రమంలో ఈవో శ్రీధర్ రావు, అర్చకులు శ్రీనివాసాచార్యులు, నరసింహాచార్యులు, పరంధామాచార్యులు, సంజీవచార్యులు ఉన్నారు.

దేవునిపల్లి శివాలయంలో పూజలు



కామారెడ్డి రూరల్: దేవునిపలిల్లి శివాలయంలో బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహారాజ పోషకులు చింతకింది రాజేశ్వరి సత్యం, దీకొండ లత నవీన్‌ల ఆధ్వర్యంలో శివస్వాములకు భిక్ష కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. అలాగే గ్రామనికి చెందిన నీలం చంద్రశేఖర్ రూ.21 వేలు చెల్లించి శివభిక్ష కమిటీలో సభ్యత్వం తీసుకున్నారు.

క్యాలెండర్ల ఆవిష్కరణ



ఎల్లారెడ్డిరూరల్: ఎల్లారెడ్డి ఆర్డీవో కార్యాలయంలో సమాచార హక్కు చట్టం పరిరక్షణ కమిటీ క్యాలెండర్లను బుధవారం ఆర్డీవో ప్రభాకర్ ఆవిష్కరించారు. రాష్ట్ర డెరెక్టర్ సలీం, లింగమయ్య ఉన్నారు.

ధర్పల్లి హెచ్‌ఎం సస్పెన్షన్

నిజామాబాద్‌అర్బన్: ధర్పల్లి ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు జ్యోతిరాణిని సస్పెన్షన్ చేస్తూ ఆర్‌జేడీ కార్యాలయం నుంచి బుధవారం ఉత్తర్వులు వెలువడ్డాయి. ధర్పల్లి పాఠశాలలో మధ్యాహ్న భోజనానికి సంబంధించి బియ్యం సరఫరాలో అక్రమాలు, ఉపాధ్యాయులను వేధించడం, తదితర అంశాలపై ఉన్నతాధికారులకు ఫిర్యాదులు వచ్చాయి. దీనిపై వి చారణ జరిపిన అధికారులు నివేదిక సమర్పించగా హెచ్‌ఎంను సస్పెన్షన్ చేస్తూ ఉత్తర్వులు వెలువడినట్లు డీఈవో అశోక్ తెలిపారు.

క్రైం కార్నర్

భూ వివాదంతోనే సోదరుడి హత్య

- సుపారీ ఇచ్చిన అన్న
- అన్నారం హత్య కేసును ఛేదించిన పోలీసులు
- వివరాలు వెల్లడించిన ఏఎస్పీ చైతన్యరెడ్డి



రామారెడ్డి పోలీస్‌స్టేషన్‌లో వివరాలను వెల్లడిస్తున్న ఏఎస్పీ చైతన్యరెడ్డి

రామారెడ్డి: రామారెడ్డి మండలంలోని అన్నారం గ్రామంలో ఇటీవల జరిగిన పొక్కలి రవి హత్య కేసును పోలీసులు ఛేదించారు. కుటుంబ సభ్యుల మధ్య నెల కొన్న భూ వివాదం నేపథ్యంలోనే హత్య జరిగినట్లు తెలిపారు. ఈమేరకు రామారెడ్డి పోలీస్ స్టేషన్‌లో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఏఎస్పీ చైతన్యరెడ్డి వివరాలు వెల్లడించారు. అన్నదమ్ములైన పొక్కలి రవి, పొక్కలి కిష్టయ్యల మధ్య భూమి పంపకాల్లో గొడవలు జరిగాయి. ఈనేపథ్యంలో రవిని హత్య చేయడానికి అన్న కిష్టయ్య పథకం పన్ని, షేక్ ఆఫీజ్, చాకలి నర్సోల్ల రాకేష్‌కు సుపారీ ఇచ్చాడు. దీంతో రవి (41)ని ఈనెల 19న ఇంట్లోనే హత్య చేశారు. ఏఎస్పీ చైతన్య రెడ్డి ఆధ్వర్యంలో ప్రత్యేకంగా టీంను ఏర్పాటు చేసి దర్యాప్తును వేగవంతం చేశారు. నిందితులను పట్టుకోగా ఏ–1గా పొక్కలి కిష్టయ్య, ఏ–2గా పొక్కలి కిషన్, ఏ–3గా షేక్ ఆఫీజ్, ఏ–4గా చాకలి నర్సోల్ల రాకేష్, ఏ–5గా పొక్కలి సత్తవ్వపై కేసు నమోదు చేసి రిమాండ్ తరలించినట్లు తెలిపారు. రూరల్ సీఐ రామన్, రామారెడ్డి ఎస్సై నరేష్, ఏఎస్సై రవీందర్ పాల్గొన్నారు.

విద్యుత్‌షాక్‌తో కౌలురైతు మృతి



మృతిచెందిన సిద్దయ్య

దోమకొండ: మండలంలోని సంఘమేశ్వర్ గ్రామానికి చెందిన మొగుళ్ల సిద్దయ్య(63) అనే కౌలురైతు బుధవారం విద్యుత్‌షాక్‌తో మృతిచెందినట్లు ఏఎస్సై సుబ్రహ్మణ్యచారి తెలిపారు. సిద్దయ్య గ్రామ శివారులో రెండెకరాల భూమిని కౌలుకు తీసుకుని గత రెండు సంవత్సరాలుగా పంట సాగుచేస్తున్నాడు. ప్రస్తుతం మొక్కజొన్న పంట వేశాడు. అడవి పందుల నుంచి రక్షణ కోసం పంట చుట్టూ సోలార్ విద్యుత్ ఫెన్సింగ్ వేశాడు. రోజుమాదిరిగా బుధవారం తెల్లవారుజామున పంట వద్దకు వెళ్లగా ఒడ్డు వద్ద కాలుజారి సోలార్ ఫెన్సింగ్‌పై పడ్డాడు. దీంతో విద్యుత్ షాక్ తగిలి మృతి చెందాడు. మృతుడికి భార్య భీరవ్వతోపాటు, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం కామారెడ్డి ఏరియా ఆస్పత్రికి తరలించినట్లు ఏఎస్సై వివరించారు.

గుండెపోటుతో జర్నలిస్టు..



లక్ష్మీనారాయణ (ఫైల్)

మాక్లూర్: మాక్లూర్ మండల కేంద్రానికి చెందిన సీనియర్ జర్నలిస్టు హిరమొల్ల లక్ష్మీనారాయణ(66) గుండెపోటువచ్చి బుధవారం తెల్లవారుజామున మృతి చెందారు. జర్నలిస్టులు, ప్రజాప్రతినిధులు పెద్ద ఎత్తున తరలివచ్చి అంత్యక్రియల్లో పాల్గొన్నారు. లక్ష్మీనారాయణ 1990 నుంచి వివిధ దిన పత్రికల్లో, టీవీ చానల్స్‌లో పని చేశారు.

దుబాయ్‌లో చింతమాన్‌పల్లివాసి ఆత్మహత్య



స్వామి(ఫైల్)

దోమకొండ: మండలంలోని చింతమాన్‌పల్లి గ్రామానికి చెందిన కొమ్మట స్వామి(25) అనే యువకుడు దుబాయ్‌లో ఆత్మహత్య చేసుకున్నట్లు గ్రామస్తులు బుధవారం తెలిపారు. ఉపాధి నిమిత్తం గతంలో దుబాయ్ వెళ్లిన స్వామి రెండు నెలల క్రితం తిరిగి గ్రామానికి వచ్చాడు. ఈనెల 12న తిరిగి దుబాయ్ వెళ్లాడు. ఆర్థిక ఇబ్బందులతో అక్కడ ఈనెల 16న తన గదిలో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు తోటి కార్మికులు కుటుంబ సభ్యులకు సమాచారం అందజేశారు. దీంతో కుటుంబసభ్యులు బోరున విలపించారు. మృతుడికి తల్లి లస్మవ్వ, తండ్రి ఆశయ్య ఉన్నారు. మృతదేహం త్వరగా స్వదేశానికి వచ్చేలా అధికారులు, ప్రజాప్రతినిధులు చొరవ చూపాలని వారు కోరుతున్నారు.

ఇసుక టిప్పర్, బొలేరో పట్టివేత



పోలీసులు పట్టుకున్న వాహనాలు

రుద్రూర్: పోతంగల్ మండలంలోని మంజీరా నది నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న బొలేరో, టిప్పర్‌ను పోతంగల్ చెక్ పోస్టు వద్ద పట్టుకున్నట్లు ఎస్సై సందీప్ బుధవారం తెలిపారు. అనుమతి లేకుండా ఇసుకను తరలిస్తుండగా మంగళవారం రాత్రి అదుపులోకి తీసుకుని పోలీస్‌స్టేషన్ తరలించామని తెలిపారు. తదుపరి చర్యల నిమిత్తం సంబంధిత అధికారులకు సమాచారం అందించినట్లు వివరించారు.

రెంజల్ మండలంలో..

రెంజల్(బోధన్): మండలంలోని బోర్గాం నుంచి తాడ్‌బిలోలి వైపు ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను బుధవారం తెల్లవారుజామున పట్టుకున్నట్లు ఎస్సై సాయన్న తెలిపారు. అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తుండటంతో తదుపరి చర్యల నిమిత్తం తహసీల్దార్‌కు అప్పగించినట్లు పేర్కొన్నారు.

ఎల్లారెడ్డిలో వ్యక్తి అదృశ్యం



రాములు

ఎల్లారెడ్డి: ఎల్లారెడ్డికి చెందిన అల్లం రాములు ఈనెల 12వ తేది నుంచి కనిపించడం లేదని ఎస్సై మహేష్ బుధవారం తెలిపారు. రాములు ఇంట్లో గొడవ పడి రాత్రి సమయంలో ఇంటి నుంచి వెళ్లిపోయాడని, ఇప్పటికీ తిరిగిరాలేదన్నారు. కుటుంబసభ్యులు ఎంత వెతికినా అతడి ఆచూకీ లభించలేదన్నారు. వారు పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

జుక్కల్ మండలంలో వివాహిత..

నిజాంసాగర్(జుక్కల్): జుక్కల్ మండలం ఖండే బల్లూర్ గ్రామానికి చెందిన సిద్దిగొండల ప్రీతిక అనే వివాహిత రెండు రోజుల నుంచి కనిపించడం లేదని ఎస్సై భువనేశ్వర్ బుధవారం తెలిపారు. ఈనెల 21న ప్రీతిక ఇంట్లో నుంచి బయటకు వెళ్లి, ఇప్పటికీ తిరిగి రాలేదన్నారు. కుటుంబసభ్యులు చుట్టుపక్కల ప్రాంతాల్లో ఎంత వెతికినా ఆమె ఆచూకీ లభించలేదు. భర్త శ్రీకాంత్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

సాక్షి క్లాసిఫైడ్స్

EDUCATION

COMPUTER EDUCATION

■ గ్రామీణ యువతి యువకులకు ఉచిత వసతితో కూడిన కంప్యూటర్ శిక్షణ & ఉద్యోగ అవకాశం అ: 18-30 yrs, SSC పాస్ సం॥ 9014569553. [SCA25001329]

SERVICES

BUSINESS SERVICES

■ మీ బంగారం మణప్పురం, ముత్తూట్, మర్వాడి షాప్ ఏ ఫైనాన్స్‌లో ఉన్న మా డబ్బుతో విడిపించి మార్కెట్ ధరకు కొనబడును. 9177555694 స్పాట్ క్యాష్. [SCA25001311]

PASSPORT MISSING

■ జడల జితేందర్ S/o. జడల కిషన్ R/o. ఇ.నెం. 2-81, కమ్మర్‌పల్లి, NZB. నేను 05-12-24 నాడు కమ్మర్‌పల్లి నుండి ఆర్మూర్ బస్టాండ్ వెళ్తుండగ N3640497 నెం. గల పాస్‌పోర్ట్ పోయినది. దొరికినచో సంప్ర॥ 6300110447. [SCA25001298]

■ జడల లావణ్య W/o. జడల జితేందర్ R/o. ఇ.నెం. 2-81, కమ్మర్‌పల్లి, NZB. నేను 05-12-24 నాడు కమ్మర్‌పల్లి నుండి ఆర్మూర్ బస్టాండ్ వెళ్తుండగ V1792466 నెం. గల పాస్‌పోర్ట్ పోయినది. దొరికినచో సంప్ర॥ 9502711586. [SCA25001299]

■ దొంతు ఉదయ్ S/o. దొంతు నాగరాజు, H.No. 1-29, జన్నెపల్లి, నవీపేట్, NZB. నేను 26-12-2024 రోజున నా యొక్క ఇంటిని మరొక చోటుకి మార్చే సమయంలో Y7386658 నెం. గల పాస్‌పోర్ట్ పోయినది. దొరికినచో సంప్ర॥ 6300674688. [SCA25001315]

WANTED

■ Universal కంపెనీకి వర్క్ చేయుటకు స్త్రీ/పు కావలెను. జీతం : 20,000 నుండి 25,000 వరకు సంపాదించుకోండి. అడ్రస్ వాట్సాప్ చేయండి. సెల్ : 95027 12418. [M-1256045]

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకై సంప్రదించండి
నిజామాబాద్
CONTACT: 9492010949

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

దివ్యాంగుల నుంచి దరఖాస్తుల స్వీకరణ



ఎల్లారెడ్డిలో దివ్యాంగుల పత్రాలను పరిశీలిస్తున్న ఆర్డీవో ప్రభాకర్

ఎల్లారెడ్డిరూరల్: ఎల్లారెడ్డి పట్టణంలోని వీకేవీ ఫంక్షన్ హాల్‌లో బుధవారం దివ్యాంగుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. వికలాంగులకు ఉచితంగా ఉపకరణాలను అందించేందుకు గాను వారి నుంచి దరఖాస్తులను తీసుకున్నట్లు ఆర్డీవో ప్రభాకర్ తెలిపారు. సదరం క్యాంపులో అందించిన దివ్యాంగుల సర్టిఫికెట్ ఆధారంగా చేతి కర్రలు, బ్యాటరీ సైకిళ్లు అందిస్తారని ఆర్డీవో తెలిపారు. జిల్లా సంక్షేమ అధికారి ప్రమీల, ఏఎంసీ చైర్మన్ రజిత, సొసైటీ వైస్ చైర్మన్ ప్రశాంత్‌గౌడ్, కాంగ్రెస్ నాయకులు కుడుముల సత్యనారాయణ, వెంకట్రాంరెడ్డి తదితరులున్నారు.

ఫిజియోథెరపి క్యాంపు

ఎల్లారెడ్డి: ఎల్లారెడ్డి పట్టణంలోని భవిత కార్యాలయంలో ఫిజియోథెరపి క్యాంపు నిర్వహించారు. అంగవైకల్యం గల చిన్నారులకు ఫిజియోథెరపి వైద్యులు అరుణ్ వైద్య పరీక్షలు చేశారు. ప్రతిరోజు ఫిజియోథెరపి వ్యాయామాలు చేయించాలని సూచించారు. సిబ్బంది వెంకటేశం తదితరులున్నారు.

అయోధ్య రాముడి వార్షికోత్సవం



చద్మల్ తండాలో శోభాయాత్ర నిర్వహిస్తున్న గ్రామస్తులు

జిల్లాలో పలుచోట్ల అయోధ్య రాముడి వార్షికోత్సవాలను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఉత్తర్‌ప్రదేశ్‌లోని అయోధ్యలో బాలరాముడి విగ్రహాన్ని ప్రతిష్ఠించి ఏడాది కావస్తున్న సందర్భంగా వేడుకలు జరిపారు. మహిళలు ప్రత్యేక పూజలు చేశారు. విగ్రహాలతో శోభాయాత్ర చేపట్టారు. పలు చోట్ల అన్నదానం నిర్వహించారు.

– గాంధారి/మద్నూర్/నస్రుల్లాబాద్



సుల్తాన్‌పేట్‌లో ..



నెమ్లిలో దీపారాధన చేస్తున్న మహిళలు

పేర్లు రానివారు మళ్లీ దరఖాస్తు చేసుకోవాలి

- అదనపు కలెక్టర్ విక్టర్



శాబ్దిపూర్‌లో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్

కామారెడ్డి రూరల్: అర్హత ఉండి గ్రామ సభల్లో చదివిన జాబితాలో పేర్లు రానివారు మళ్లీ దరఖాస్తు చేసుకోవచ్చని అదనపు కలెక్టర్(రెవిన్యూ) వి.విక్టర్ అన్నారు. బుధవారం కామారెడ్డి మండలం శాబ్దిపూర్, గూడెం, తిమ్మక్‌పల్లి, ఉగ్రవాయి గ్రామాల్లో గ్రామ సభలు జరిగాయి. శాబ్దిపూర్ గ్రామ సభలో ఆయన పాల్గొని మాట్లాడారు. రేషన్ కార్డుల జారీ నిరంతర ప్రక్రియ అని అన్నారు. అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ప్రభుత్వ పథకాలు అందేవిధంగా చూస్తామన్నారు. కామారెడ్డి తహసీల్దార్ జనార్దన్, ఎంపీడీవో నాగవర్ధన్, మాజీ జెడ్పీటీసీ నిమ్మ మోహన్‌రెడ్డి, నిమ్మ విజయ్‌కుమార్‌రెడ్డి, నర్సాగౌడ్, తదితరులు పాల్గొన్నారు.

కారుపై విరిగిపడ్డ చెట్టు



ఖలీల్‌వాడి: నగరంలోని తిలక్ గార్డెన్ వద్ద బుధవారం సాయంత్రం ఓ చెట్టు అకస్మాత్తుగా విరిగిపడి రోడ్డుపై వెళ్తున్న కారుపై పడింది. ఈ ఘటనలో కారులో ఉన్న ప్రయాణికులకు స్వల్ప గాయాలు అయ్యాయి. వెంటనే స్థానికులు వారిని చికిత్స నిమిత్తం ఓ ప్రయివేట్ ఆస్పత్రికి తరలించారు. సమాచారం అందుకున్న ట్రాఫిక్ సిబ్బంది ఘటన స్థలానికి చేరుకున్నారు. రోడ్డుపై పడ్డ చెట్ల కొమ్మలతో ట్రాఫిక్‌కు అంతరాయం కలుగగా సిబ్బంది తొలగించారు. కట్టర్ సహాయంతో చెట్టును కట్ చేయించి, ట్రాఫిక్ ఇబ్బంది కలుగకుండా చర్యలు చేపట్టారు.

డ్రంకన్‌డ్రైవ్ కేసుల్లో పలువురికి రెండు రోజుల జైలు

ఖలీల్‌వాడి/నందిపేట్/కమ్మర్‌పల్లి: నిజామాబాద్ జిల్లాలోని పలు ప్రాంతాల్లో పోలీసులు డ్రంకన్‌డ్రైవ్ తనిఖీలు చేపట్టగా పలువురు వాహనదారులు మద్యం తాగి నడపడంతో వారిని పట్టుకున్నారు. అనంతరం వారిని కోర్టుల్లో హాజరు పర్చగా కోర్టు వారికి 2రోజుల జైలు శిక్షను విధించింది. నగరంలో పట్టుబడ్డ శంకర్, రాజేష్ సాహెబ్రామ్‌ను నిజామాబాద్ సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ ఎదుట హాజరు పర్చగా ఇద్దరికీ 2రోజుల జైలు శిక్ష విధించారు.

నందిపేటకు చెందిన అబ్దుల్ సత్తార్‌కు, కమ్మర్‌పల్లి మండలానికి చెందిన మర్రి అంజయ్యకు ఆర్మూర్ సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ రెండు రోజుల సాధారణ జైలు శిక్ష విధిస్తూ తీర్పు నిచ్చినట్లు పోలీసులు తెలిపారు.

అర్ధరాత్రి వరకు షాప్ నిర్వహించిన యజమానికి..

ఖలీల్‌వాడి: నగరంలోని ఖిల్లా రోడ్డులో సయ్యద్ మోసిన్(32) తన పాన్‌షాప్‌ను అర్ధరాత్రి వరకు తెరిచినందుకు పోలీసులు అతడిని పట్టుకున్నారు. అనంతరం కోర్టులో అతడిని హాజరుపరుచగా పాన్ షాప్ యజమానికి జడ్జి రెండు రోజులు జైలు శిక్ష విధించినట్లు ఒకటో టౌన్ పోలీస్ స్టేషన్ ఎస్ హెచ్‌వో రఘుపతి బుధవారం తెలిపారు.

వ్యభిచార గృహంపై పోలీసుల దాడి



నిందితులను చూపుతున్న పోలీసులు

ఖలీల్‌వాడి: నగరంలో కొనసాగుతున్న వ్యభిచార గృహంపై టాస్క్‌ఫోర్స్ పోలీసులు బుధవారం దాడి చేశారు. వినాయక్‌నగర్ పంచముఖి హనుమాన్ మందిరం వెనుక రోడ్ నెంబర్ 7 ప్రాంతంలోని ఓ ఇంట్లో వ్యభిచారం నిర్వహిస్తున్నారన్న పక్కా సమాచారం మేరకు ఏసీపీ నాగేంద్ర చారి ఆధ్వర్యంలో పోలీసులు దాడి చేశారు. నిర్వాహకురాలితో పాటు ఇద్దరు విటులు, ఇద్దరు బాధితురాళ్లను అదుపులోకి తీసుకున్నట్లు టాస్క్ ఫోర్స్ ఏసీపీ తెలిపారు. వారి వద్ద నుంచి రూ.5900 నగదు స్వాధీనం చేసుకుని, వారిని నాలుగో టౌన్ పోలీసులకు అప్పగించినట్లు తెలిపారు. టాస్క్‌ఫోర్స్ సీఐ అంజయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

దుకాణాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఏసీపీ రాజావెంకట్‌రెడ్డి

ఖలీల్‌వాడి: జువెల్లర్ దుకాణాల్లో సీసీ కెమెరాలు, హైసెక్యూరిటీ లాక్‌లను ఏర్పాటు చేసుకోవాలని ఏసీపీ రాజావెంకట్ రెడ్డి షాప్ యజమానులకు సూచించారు. నగరంలోని ఒకటో టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని గోల్డ్ షాప్స్ యజమానులతో బుధవారం ఆయన ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా దొంగతనాలు, సైబర్ నేరాలపై వారికి అవగాహన కల్పించారు. ఏసీపీ మాట్లాడుతూ.. దుకాణాల వద్ద సెక్యూరిటీ గార్డులను నియమించుకోవాలని తెలిపారు. వ్యాపారం ముగిసిన తరువాత గోల్డ్, క్యాష్ సేఫర్‌లో భద్రపర్చాలని, సేఫర్లు ఎవరికీ కనిపించని ప్లేస్‌లో పెట్టాలన్నారు. డిజిటల్ ట్రాన్సక్షన్స్ మాత్రమే చేయాలని తెలిపారు. సీసీటీవీ కెమెరాలు బిగించి, క్లౌడ్ స్టోరేజ్‌కి అనుసంధానం చేయాలన్నారు. షాప్‌లల్లో అలారం సిస్టంను బిగించుకొని, స్థానిక పోలీస్ స్టేషన్‌కు అనుసంధానం చేయాలన్నారు. క్యాష్, గోల్డ్ తరలించే వాహనాలకు జీపీఎస్ ట్రాకర్స్‌ను ఏర్పాటు చేయాలన్నారు.

నలుగురి బైండోవర్

భిక్కనూరు: పోలీస్ విధులకు ఆటంకం కలిగించిన నలుగురిని బైండోవర్ చేసినట్లు ఎస్సై ఆంజనేయులు బుధవారం తెలిపారు. భిక్కనూర్‌కు చెందిన చేపూరి భాను, బండి నరేష్, రామేశ్వర్‌పల్లికి చెందిన బోయిని కనకరాజు, మెదక్ జిల్లా కొండాపూర్‌కు చెందిన వర్దం నర్సింలు ఇటీవల అనవసరంగా పలుమార్లు డయల్ 100కు కాల్ చేసి, పోలీసు విధులకు అంతరాయం కలిగించారని తెలిపారు. దీంతో వారిని తహసీల్దార్ శివప్రసాద్ ఎదుట బైండోవర్ చేసినట్లు ఎస్సై తెలిపారు.